


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 216 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | శనివారం 11 ఏప్రిల్ 2026 | వెల : 1/-రూ ॥


VOLUME :9 ISSUE :216 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | SAT 11 APRIL 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# పీఎన్జీ కనెక్షన్లు వేగవంతం చేయండి..

## రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సీఎం చంద్రబాబు సమీక్ష

- రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- పీఎన్జీ వినియోగాన్ని పెంచాలని, 6 నెలల్లో 10 లక్షల కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యం
- దీపం లబ్ధిదారులు పీఎన్జీకి మారినా రాయితీ కొనసాగించాలని నిర్ణయం
- శ్రీకాకుళం-కాకినాడ పైప్‌లైన్ పనుల జాప్యంపై కేంద్ర మంత్రికి సీఎం ఫోన్
- యుద్ధాల నేపథ్యంలో ఎల్పీజీ కొరత రాకుండా ప్రత్యామ్నాయ చర్యలకు ఆదేశం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయంగా యుద్ధాల కారణంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో తలెత్తుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని అధికారులను, ఆయిల్ కంపెనీల ప్రతినిధులను ఆయన ఆదేశించారు. ప్రత్యామ్నాయంగా పీఎన్జీ వినియోగాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. వచ్చే 6 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని, నిర్దేశిత లక్ష్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ చేరుకోవాలని తేల్చిచెప్పారు. ఈ సమీక్షలో భాగంగా 'దీపం' పథకం లబ్ధిదారులను పీఎన్జీ వైపు ప్రోత్సహించడంపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీపం లబ్ధిదారులు పీఎన్జీ కనెక్షన్‌కు మారితే, వారికి పథకం కింద అందే రాయితీ


మిగతా 2లో

## మంత్రులకు చంద్రబాబు సీరియస్ వార్నింగ్..

### ఇంకో సారి రిపీట్ కాకూడదంటూ హెచ్చరిక

- మూడు గంటల పాటు కొనసాగిన కేబినెట్ సమావేశం
- సమావేశానంతరం మంత్రులతో చంద్రబాబు ప్రత్యేక భేటీ
- ప్రభుత్వ సమాచారం లీక్ అవుతుండటంపై సీఎం సీరియస్
- మరోసారి రిపీట్ అయితే మంత్రులను బాధ్యులను చేస్తానంటూ వార్నింగ్
- గతంలో ఇలాంటి లీకుల వల్లే కేబినెట్‌ను ఎన్టీఆర్ రద్దు చేశారని గుర్తు చేసిన వైనం

మిగతా 2లో



### నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ

## అమరావతిపై సజ్జల విమర్శలు

- అమరావతిలో సామాన్య ప్రజలు నివసించే పరిస్థితి లేదన్న సజ్జల
- అమరావతిని అవినీతికి తరగని గనిలా చంద్రబాబు వాడుకుంటున్నారని ఆరోపణ
- ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చెప్పలేకపోతున్నారని విమర్శ

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మిస్తున్న అమరావతి రాజధాని 40 ఏళ్లయినా పూర్తికాదని, అదొక అసాధ్యమైన ఆలోచన అని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ, అక్కడ కేవలం భవనాలు మాత్రమే ఉన్నాయి తప్ప జనం లేరని, అమరావతి

మిగతా 2లో





## నమాజ్ కోసం ఉగ్రవాదులపై దాడిని వాయిదా వేశాం..

### ఆపరేషన్ సిందూర్ రహస్యాలు వెల్లడించిన ఆర్మీ చీఫ్

- ఉగ్రవాద శిబిరంపై దాడిని నమాజ్ కోసం వాయిదా వేసిన సైన్యం
- 'అందరి దేవుడు ఒక్కడే' అనే భావనతోనే ఈ నిర్ణయమన్న ఆర్మీ చీఫ్
- సైన్యంలో మహిళల చేరికపై కుమార్తెల సలహాలు తీసుకుంటానన్న జనరల్ ద్వివేది
- మార్కుల కన్నా వ్యక్తిత్వం, పరిస్థితులకు అనుగుణంగా మారడమే ముఖ్యం

మిగతా 2లో



## భాగ్యనగరంలో 'ప్రేమ' ముసుగులో మతం మార్పిడి దందా

### అన్నదమ్ముల ఘాతుకం వెలుగులోకి

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో హిందూ యువతులను లక్ష్యంగా చేసుకుని సాగు తున్న ఒక దారుణమైన

మిగతా 2లో



## ట్రెండ్ ను ఫాలో కావొద్దు... సవాళ్లను స్వీకరించండి

### బెంగళూరులో నారా లోకేశ్

- బెంగళూరు గ్రీన్‌వుడ్ హై స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో మంత్రి లోకేశ్
- సవాళ్లను స్వీకరించి లక్ష్యంపై దృష్టి పెట్టాలని యువతకు సూచన
- షార్ట్ కట్ల ప్రపంచంలో నైతికతే గొప్ప బలమని ఉద్బోధ
- ఏపీ, విశాఖ అభివృద్ధిలో సత్వా గ్రూప్ భాగస్వామి కానుందని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలని, ట్రెండ్‌ను అనుసరించకుండా నిర్దిష్ట లక్ష్యంపై దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. బెంగళూరులోని సర్జాపూర్‌లో ఉన్న గ్రీన్‌వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ (గ్రేడ్-12) 2026 గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన

మిగతా 2లో




## పులివెందులకు 'అవి గొడ్డలి' అని పేరు పెట్టండి

- అమరావతికి 'మావిగన్' పేరుపై జగన్‌ను ఎగతాళి చేసిన షర్మిల
- అవినాశ్ రెడ్డి పేరు మీద పులివెందులకు 'అవి గొడ్డలి' అని పేరు పెట్టాలంటూ వ్యంగ్యం
- గన్నులు, గొడ్డళ్లే వైసీపీ సిద్ధాంతమా అని తీవ్ర విమర్శ
- ఐదేళ్లలో రాజధానికి ఇటుక కూడా పెట్టలేదని ఆరోపణ
- 'మావిగన్' ఆలోచన ఒక జోక్ అని కొట్టిపారేసిన షర్మిల

మిగతా 2లో

### భోగాపురం విమానాశ్రయం

## ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!



- తుది దశకు చేరుకున్న భోగాపురం విమానాశ్రయం పనులు
- మోదీకి నాలుగు తేదీలను సూచించిన ఏపీ ప్రభుత్వం
- ఈ విమానాశ్రయంతో మారిపోనున్న ఉత్తరాంధ్ర రూపురేఖలు

మిగతా 2లో



## యూపీలో పడవ బోల్తా... 10 మంది మృతి...

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

- మధురలోని యమునా నదిలో పడవ బోల్తా
- ప్రమాదంలో 10 మంది యాత్రికులు మృతి
- 14 మందిని కాపాడిన సహాయక బృందాలు
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ప్రమాదంపై ప్రధాని, యూపీ సీఎం దిగ్భ్రాంతి

పెన్ పవర్ డెస్క్:ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లాలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. బృందావన్‌లోని కేశీఘాట్ వద్ద యమునా నదిలో యాత్రికులతో వెళుతున్న పడవ బోల్తా పడటంతో 10 మంది మృతి చెందారు. మరో 14 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళితే, పంజాబ్‌కు చెందిన సుమారు 30 మంది యాత్రికులు శుక్రవారం మధ్యాహ్నం పడవలో యమునా నదిలో ప్రయాణిస్తున్నారు.

మిగతా 2లో

## లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు.. కీలక వ్యాఖ్యలు చేసిన తెలంగాణ డీజీపీ

- లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి నేత కేశాలు
- ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయారన్న డీజీపీ
- తెలంగాణలో నలుగురు మావోయిస్టులు మాత్రమే మిగిలిపోయారని వెల్లడి
- వారు కూడా లొంగిపోవాలని పిలుపు

పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండగా, తాజాగా భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో మొత్తం 42 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలోకి చేరారు. లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి కలిగిన కేశాలు

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ఏకధ్రువ ప్రపంచానికి చెక్ పెట్టినట్లేనా!

ప్రతిమనిషి పుట్టుకతోనే జీవించే హక్కుతో భూమిమీదకు వస్తాడు. మరణం అనేది ఆ హక్కుకు దూరం కావడమే! సాధారణ మరణం సహజ ప్రక్రియ. యుద్ధ మరణం అనేది ఉన్మాద చర్యతో జీవించే హక్కును అర్ధాంతరంగా తుంచివేయడం. అందుకే ఏరకమైన యుద్ధమైనా వినాశ హేతువే? యుద్ధం ఒక పీడకచర్య. యుద్ధ మరణాలకు హేతుబద్ధత ఉండదు. మధ్యయుగాలలో యుద్ధమంటే వీరత్వానికి ప్రతీక. అటు తర్వాత ఆయుధం ప్రధానపాత్ర వహించింది. అధికారానికి ఆయుధం ప్రాకారంగా నిలిచింది. సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ దశలో ఆయుధానిదే పైచేయి అయింది. ఇప్పుడు యుద్ధ వ్యూహాల్లో మార్పులొచ్చాయి. ఒకప్పుడు రష్యా, అమెరికా ప్రచ్ఛన్న యుద్ధస్థితి నుంచి, రష్యా అంతర్గత రాజకీయ మార్పుల తర్వాత అమెరికా ఏకధృవ ప్రపంచంగా ఎదిగింది. అంతేకాదు, తమ భూభాగంలో కాకుండా ప్రపంచం మొత్తం యుద్ధ స్థావరాలు ఏర్పరచుకొని, సైన్యాన్ని మోహరించి ప్రపంచ పోలీసుగా పెత్తనం చేస్తోంది. జనరల్ గడాఫీ, అలెండీ, సద్దాం హుస్సేన్ లాంటి ఎందరో దేశాధినేతలను హత్య చేయడంతో పాటు, ఆసియా, అమెరికా, ఆఫ్రికా ఖండాల్లో అనేక దేశాలతో యుద్ధాలు చేసింది. చివరకు తమ వ్యాపార సామ్రాజ్యానికి పోటీరాకుండా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబులు వేసి సామూహిక మానవహననానికి అమెరికా పాల్పడింది. వియత్నాంతో పదహారేళ్ల సుదీర్ఘ యుద్ధం తర్వాత అమెరికా దూకుడుకు కళ్లెం పడింది.

ఇప్పుడు ఇరాన్‌తో భూతల యుద్ధంతో తలపడడం అంటే చావునోట్లో తలపెట్టడమేనన్న వ్యవహారం అర్థమైన తర్వాత ఇంటా, బయట ఏకాకిగా మారిన ట్రంప్, వ్యూహం మార్చి ఇరాన్‌తో సీజ్ ఫైర్‌కు తాపత్రయ పడ్డాడు. వ్యూహాత్మకంగా ఊపిరి పీల్చుకోవడానికి ఇరాన్ కూడా పది షరతులతో సిద్ధమైంది. సీజ్‌ఫైర్ అనబడే ఒప్పందం అనేది ఇటీవల కాలంలో ముందుకొచ్చిన దౌత్య ప్రక్రియనే. ఒకప్పుడు గ్రూపుల మధ్య ఒప్పందం ఇప్పుడు దేశాల మధ్యకు మారింది. భారత్-పాకిస్తాన్, ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాలలో ట్రంప్ ముందుకు తెచ్చిన ప్రక్రియనే ఇది. కొత్తదేం కాదు, కాకుంటే ఓటమి అంచుల్లో పరువు దక్కించుకునే ఏకైక సూచిక! ట్రంప్ రెండువారాల యుద్ధ వెసులుబాటుకు ప్రయత్నమే ఆయనలో నెలకొన్న ఓటమి భయానికి నిదర్శనం. ఇరాన్‌లో 240మంది మహిళలు, 212 మంది పిల్లలు వెరసి 2076 మంది ప్రజలు యుద్ధంలో మరణించారు, 26,500 ప్రజలు గాయపడ్డారు. మిత్రదేశం లెబనాన్‌లో మరో 13వందల మంది ప్రజలను ఇజ్రాయిల్ చంపేసింది. అంతేకాదు, యుద్ధ ప్రారంభంలోనే ఇజ్రాయిల్, అమెరికా కుట్రపూరితంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయుతుల్లా ఖొమైనీని అంతం చేసింది. అయినా ఇరాన్ తమ మౌలిక వనరుల రక్షణ దృష్టితో సీజ్‌ఫైర్‌కు అంగీకరించింది.

సుదీర్ఘ కాలం తమవెంట ఉన్న పశ్చిమ యూరప్ దేశాల యుద్ధ కూటమి "నార్త్ అట్లాంటిక్ ట్రిటీ ఆర్గనైజేషన్' నాటోలోని 30 దేశాలు ఇరాన్‌పై ట్రంప్ దాడికి మద్దతివ్వలేదు. సరికదా కొన్ని దేశాలు నేరుగా ఇరాన్‌కు మద్దతు తెలిపాయి. ఇక ప్రపంచ దేశాల ప్రజలతో పాటు, తనదేశంలో ప్రజలు నిరసన పతాకస్థాయికి చేరడంతో ట్రంప్ ఓ అడుగు సీజ్‌ఫైర్ పేరుతో వెనక్కి తగ్గాడు తప్ప, తనలోని యుద్ధ పిపాసి ఇంకా చావలేదు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత పిచ్చోడి చేతిలో రాయిలా ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల పేరుతో విరుచుకుపడ్డాడు. గాజా విషయంలో ఇజ్రాయిల్ అమానుష కాండకు పరోక్షంగా మద్దతిచ్చాడు. పనామా అధ్యక్షుడు నోరిగోను మాదకద్రవ్యాల పేరుతో జైలు శిక్ష వేసి నిర్భందించాడు."ఆపరేషన్ అబ్జార్వేట్ రిజర్వ్" పేరుతో ప్రజలచేత ఎన్నికైన వెనెజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియాలను అర్థరాత్రి ఇంటినుంచి కిడ్నాప్ చేసి అమెరికా జైలులో నిర్బంధించాడు.కేవలం ఆయిల్‌పై నియంత్రణ కోసం ఒకదేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేయడమే కాక, తన పదవీ కాలం ముగిసిన తర్వాత వెనెజులాలో ఎన్నికలని కుళ్లు జోకులు వేస్తున్నాడు. పక్క రాష్ట్రం మెక్సికోతో ఘర్షణ, చిన్నదీవి లాంటి దేశం క్యూబాపై మానవత్వం మరచి ఆంక్షలు పెట్టడంతో పాటు, ఇరాన్ యుద్ధం తర్వాత క్యూబా అంతు చూస్తానంటున్నాడు. మరోవైపు పక్క దేశం కెనడాను తమదేశంలో అంతర్భాగం రాష్ట్రంగా కలుపుకుంటామని అవాకులు చవాకులు పలుకుతున్నాడు. నాటోలో అంతర్భాగమైన డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించి నాటో కూటమి దేశాల్లో తమ పరపతి కోల్పోయాడు.

ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ విమానాశ్రయం కావాలని పట్టుబడుతున్నాడు. ఇవన్నీ ట్రంప్ ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించకుండా వేస్తున్న చిల్లర వేషాలు తప్ప మరొకటి కాదు. మరో ముఖ్యమైన విషయం. ఎప్‌స్టీన్ ఫైల్స్ నుండి బయటపడడం కోసం, అత్యంత పెద్దదైన ఆసియా ఖండంలో పట్టుకోసం మరో యుద్ధోన్మాద దేశం ఇజ్రాయిల్‌తో కలిసి కుట్రపన్నాడు! ఇరాన్‌ను ఓడిస్తే తనకు ప్రపంచంలో తిరుగుండదని, యుద్ధ ప్రారంభంలోనే ఖొమైనీ లాంటి ఆయువుపట్టును లేపేస్తే, తాను వెనెజులా దేశంలా ఇరాన్‌ను కబళించి ఆధిపత్యం చెలాయించాలని చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. నలభై రోజులుగా యుద్ధంలో ఇరాన్ అటు ఇజ్రాయిల్‌తో పోరాడుతూనే, అమెరికా అవకాశ ఆధిపత్యాన్ని వ్యూహాన్ని సవాల్ చేసి నిలబడింది. ఇరానియన్ రిపబ్లిక్ గార్డుల ధైర్య సాహసాలముందు అమెరికా తలవంచక తప్పలేదు. అగ్రరాజ్య ఆధునిక యుద్ధ విమానాలను కూల్చివేయడంతో ట్రంప్ దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. అంతర్గత సంక్షోభం, అధికార మార్పిడి లాంటి మాటలు ఇరాన్‌లో తుత్తునీయలు కావడం, ప్రపంచ పాలక వర్గాలు ఎలావున్నా ప్రజలు మద్దతు ఇరాన్‌కు అను కూలంగా ఉండడం, ఇరాన్ కూడా భౌగోళిక యుద్ధ తంత్రం హార్మూజ్ జలసంధి మూసివేత, గల్ఫ్‌లో ఉన్న సౌదీ అరేబియా తదితర దేశాల్లో అమెరికా సైనిక శిబిరాలు, ఆయా దేశాల సాంకేతిక, ఆర్థిక వనరులపై వ్యూహాత్మకంగా దాడులు జరపడం ద్వారా అమెరికాకు వణుకు పుట్టించిందని చెప్పవచ్చు. ఇజ్రాయిల్ కోసం అమెరికా ఇరాన్‌పై దండయాత్రకు దిగింది. తమకు అమెరికా ప్రజలతో ఎలాంటి శత్రుత్వం లేదని ఇరాన్ ప్రకటించడం ఆ దేశ కుయుక్తిని ఎండగట్టింది. అమెరికా ఇరాన్ యుద్ధంలో ఒంటరై ఏకధృవ ప్రపంచం ఏవగింపునకు గురైంది. ఈ దశలో సీజ్‌ఫైర్ రెండు వారాల తర్వాత శాశ్వత ఒప్పందం జరుగుతుందా? యూటర్న్ తీసుకుంటుందా? ఈ విషయం నిర్ధారించే పరిస్థితి లేదు. ఎందుకంటే ఒప్పందం జరిగింది అమెరికా-ఇరాన్ మధ్య కనుక తాము యుద్ధం ఆపేది లేదని ఇజ్రాయిల్ తన యుద్ధ దాహం తీరక లెబనాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తోంది. అందుకు ప్రతిగా ఇరాన్ సైతం గల్ఫ్‌లో ఇజ్రాయిల్, అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ద్వారా రష్యా ఒకింత ఆయిల్ వ్యాపార రీత్యా, ఉక్రెయిన్ వైపు అమెరికా ఆయుధ సంపత్తి అందకుండా చేయడంలో సఫలమైంది. చైనా, ఉత్తరకొరియా, రష్యా దేశాలు ఇరాన్‌కు అందించిన సాంకేతిక, ఆయుధ మద్దతు ఆ దేశం నిలబడడానికి చాలా తోడ్పాటునందించింది. హార్మూజ్ జలసంధి విషయంలో చైనా, రష్యా, ఫ్రాన్స్ ఐక్యరాజ్యసమితిలో తమ వీటో అధికారంతో ఇరాన్‌కు మద్దతు పలకడం అమెరికా ఏకఛత్రాధిపత్యానికి ఒక రకంగా చెక్ పెట్టినట్లే!

## పులివెందులకు 'అవి గొడ్డలి' అని పేరు పెట్టండి

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏపీ రాజధానికి 'మావిగన్' అని పేరు పెట్టాలన్న జగన్ ప్రతిపాదనను ఆమె తీవ్రంగా ఎగతాళి చేశారు దీనికి కౌంటర్‌గా, పులివెందుల నియోజకవర్గానికి 'అవి గొడ్డలి' అని పేరు మార్చాలంటూ సంచలన సెటైర్ వేశారు. ఈ వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో పెను దుమారం రేపాయి.జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' ఆలోచనను పూర్తిగా అపహాస్యం చేసిన షర్మిల, వైసీపీ సిద్ధాంతంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఎంతసేపు గన్నులు, గొడ్డళ్లేనా? నరకాలి, చంపాలి, నాశనం చేయాలనే ఆలోచిస్తారా?" అని ఆమె ప్రశ్నించారు. జగన్ పేరులో 'గన్' ఉందని, వైఎస్ అవినాశ్ రెడ్డి పేరులో 'వినాశనం' ఉందని, వారి ఆలోచనా విధానం కూడా హింస చుట్టూనే తిరుగుతుందని ఆమె ఆరోపించారు. వివేకా హత్య కేసును పరోక్షంగా ప్రస్తావిస్తూ, "అమరావతికి మీ పేరు మీద 'మావిగన్' అని పెడితే, పులివెందులకు అవినాష్ రెడ్డి పేరు మీద 'అవి గొడ్డలి' అని పెట్టాలి" అని ఎద్దేవా చేశారు.గత ఐదేళ్ల పాలనలో జగన్ రాజధాని అమరావతి కోసం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని షర్మిల విమర్శించారు. అధికారంలోకి రాగానే ప్రజావేదికను కూల్చివేయడంతోనే పాలన మొదలుపెట్టారని గుర్తుచేశారు. "ఇప్పుడు అమరావతి వద్దు, మావిగన్ పెడతారట. ఈ ఐడియా అంత అద్భుతంగా ఉంటే, ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు అమలు చేయలేదు?" అని ఆమె నిలదీశారు. 'మావిగన్'కు ఖర్చు తక్కువైతే, మరి మూడు రాజధానుల ప్రతిపాదన ఎందుకు తెరపైకి తెచ్చారని ప్రశ్నించారు.జగన్ 'మావిగన్' ప్రతిపాదనపై తమ వైఖరి ఏంటని అడుగుతున్నారని, ఎవరైనా ఓ జోక్ వింటే గట్టిగా నవ్వాలి తప్ప స్పందించాల్సిన అవసరం లేదని ఆమె కొట్టిపారేశారు. ఇదే సందర్భంలో, గతంలో నిండు సభలో వైఎస్ విజయమ్మను అవమానించినందుకు మంత్రి బొత్స సత్యనారాయణ ఎంత ఏడ్చినా తక్కువేనని కూడా షర్మిల వ్యాఖ్యానించారు.

# మంత్రులకు చంద్రబాబు సీరియస్ వార్నింగ్..

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలతో ముగిసింది. సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు చేశారు. అయితే, అజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన ముఖ్యమంత్రి, ప్రభుత్వ సమాచారం లీక్ అవుతున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండా, ఇతర రహస్య వివరాలు సమావేశానికి ముందే బయటకు రావడంపై మంత్రులను నిలదీశారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగానే ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేయాల్సి వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే సంబంధిత మంత్రులనే బాధ్యులను చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటానని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కూడా ముఖ్యమంత్రి మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా 'జలధార' పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి బలంగా వెళ్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. భూములకు సంబంధించిన పాస్‌బుక్స్ పంపిణీ వ్యవహారంపై రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని... మంత్రులు, అధికారులు నెలకు కనీసం నాలుగు సార్లు జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ 'సూర్య ఘర్' పథకం లక్ష్యాలను వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులకు స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లు అంశంపై కూడా కేబినెట్‌లో ప్రాథమిక చర్చ జరిగింది.

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాబోయే మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. పరిపాలనలో పారదర్శకత పెంచాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పథకాల అమలులో వేగం పెంచాలని ముఖ్యమంత్రి మంత్రులకు నిర్దేశించారు.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న కార్యక్రమాల వివరాలు గోప్యంగా ఉంచాలని, క్రమశిక్షణారాహిత్యాన్ని సహించేది లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు.

# పీఎన్జీ కనెక్షన్లు వేగవంతం చేయండి..

- మొదటి పేజి తరువాయి

సొమ్మును యథావిధిగా వారి ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఈ విషయంపై లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, సంబంధిత ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎన్జీ వాడకం సురక్షితమని, చౌక అని ప్రజలకు వివరించాలన్నారు.

**కేంద్రమంత్రికి ఫోన్**

ప్రస్తుతం గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఇబ్బందులను అధిగమించామని, త్వరలోనే పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో శ్రీకాకుళం-కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ పనుల్లో జాప్యంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు.

కేంద్రం నుంచి కొన్ని అనుమతులు రావాల్సి ఉందని అధికారులు చెప్పడంతో, సమీక్ష సమావేశం నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి చంద్రబాబు ఫోన్ చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినందున, పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# నమాజ్ కోసం ఉగ్రవాదులపై దాడిని వాయిదా వేశాం..

భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఒక కీలక విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాద శిబిరంపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడి చేసేందుకు సిద్ధమైనప్పుడు, అక్కడ ఉగ్రవాదులు నమాజ్ చేస్తున్నారని తెలిసి దాడిని ఉద్దేశపూర్వకంగా వాయిదా వేసినట్లు తెలిపారు. సైనిక లక్ష్యాలతో పాటు మానవతా విలువలకు కూడా ప్రాధాన్యత ఇస్తామని చెప్పడానికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రిషభ్ షా హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఐఐఎంయూఎన్ వారి 'బిఫోర్ ఐ బికేమ్ మీ' అనే పాడ్‌కాస్ట్‌లో జనరల్ ద్వివేది మాట్లాడారు. "మేము ఆ లక్ష్యాలను ఎప్పుడైనా ధ్వంసం చేయవచ్చు. కానీ, అవతలి వైపు ఉగ్రవాద శిబిరంలో వారు నమాజ్ చేస్తున్న సమయంలో దాడి చేయకూడదని నిర్ణయించుకున్నాం. ఎందుకంటే అందరి దేవుడు ఒక్కడే. అందుకే వారు ప్రార్థనలో లేని సమయాన్ని ఎంచుకున్నాం" అని ద్వివేది వివరించారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితం, నాయకత్వ శైలి గురించి కూడా ఆయన పంచుకున్నారు. సైన్యంలో మహిళల చేరిక, పని వాతావరణం వంటి విషయాల్లో తన కుమార్తెలు మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. "వారు చెప్పే విషయాలను నేను చాలా సీరియస్‌గా తీసుకుంటాను. అవసరమైన

చోట వాటిని అమలు చేస్తాను. వారే నాకు ఈ మార్పులను ఎలా స్వీకరించాలో నేర్పారు" అని ఆయన అన్నారు. తన సైనిక్ స్కూల్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ రోజుల గురించి మాట్లాడుతూ, మార్కుల కన్నా వైఖరి, పరిస్థితులకు అనుగుణంగా మారగలగడమే ముఖ్యమని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు. "మార్కులు కేవలం చదువులోని ప్రతిభకు సూచిక మాత్రమే, అవి మీ వ్యక్తిత్వాన్ని నిర్ధారించలేవు" అని ఆయన వ్యాఖ్యానించారు. అత్యంత క్లిష్టమైన కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో నైతిక సందిగ్ధత ఎదురైనప్పుడు, ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి భగవద్గీత, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలు ఎంతగానో సహాయపడతాయని జనరల్ ద్వివేది తెలిపారు.

# ట్రెండ్ ను ఫాలో కావొద్దు... సవాళ్లను స్వీకరించండి

- మొదటి పేజి తరువాయి

ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. షార్ట్‌కట్‌లతో నిండిన ప్రస్తుత ప్రపంచంలో నైతికతే గొప్ప బలమని లోకేశ్ అన్నారు. "కేవలం ఏం నేర్చుకున్నారన్నది కాకుండా, ఎలా ఆలోచిస్తున్నారనేదే అత్యంత ముఖ్యం. ఎవరూ చూడనప్పుడు మనం ఎలా ప్రవర్తిస్తామో అదే మన నిజమైన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది" అని విద్యార్థులకు హితవు పలికారు. లక్ష్య సాధనలో పట్టుదలతో ఉండాలని, ఎదురయ్యే అడ్డంకులను అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు. ఈ పర్యటన సందర్భంగా మంత్రి లోకేశ్ కీలక ప్రకటన చేశారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ పాఠశాల నడుస్తోందని, త్వరలోనే ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా విశాఖపట్నం అభివృద్ధిలో భాగస్వామ్యం కాబోతోందని వెల్లడించారు. గ్రీన్‌వుడ్ హై స్కూల్ అంతర్జాతీయ స్థాయిలో పౌరులను (గ్లోబల్ సిటిజన్స్) తయారు చేస్తుండటం గర్వకారణమని ఆయన ప్రశంసించారు.

అంతకుముందు, పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్ కు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం

ఆయన స్కూల్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆర్ట్ గ్యాలరీ, తరగతి గదులను సందర్శించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన లోకేశ్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.

## నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ

# అమరావతిపై సజ్జల విమర్శలు

- మొదటి పేజి తరువాయి

పరిస్థితి కూడా అలాగే మారుతుందని ఆయన హెచ్చరించారు.కేవలం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల కోసం విలాసవంతమైన బంగ్లాలు కడుతున్నారే తప్ప, సామాన్య ప్రజలు అక్కడ నివసించే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ స్థాయిలో రేట్లు పెట్టి... ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని చోటికి ప్రజలు ఎందుకు వస్తారని సజ్జల ప్రశ్నించారు.చంద్రబాబు అమరావతిని ఒక 'గ్రోత్ ఇంజిన్'లా కాకుండా, తన అవినీతికి తరగని గనిలా, అక్షయపాత్రలా వాడుకుంటున్నారని సజ్జల ఆరోపించారు. రాజధాని పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు తీసుకురావడం భావితరాలకు అన్యాయం చేయడమేనని మండిపడ్డారు. తన సొంత సంస్థ హెరిటేజ్‌ను నడిపేటప్పుడు తీసుకునే ఆర్థిక జాగ్రత్తలను, రాజధాని నిర్వహణలో చంద్రబాబు ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. అప్పుల ద్వారా వచ్చే నిధులతో ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చంద్రబాబు సూటిగా సమాధానం చెప్పలేకపోతున్నారని, ఆయన మాటల్లో డొల్లతనం కనిపిస్తోందని విమర్శించారు. మరోవైపు వైసీపీ అధినేత జగన్ ప్రతిపాదించిన మావిగన్ రాజధాని గురించి సజ్జల ప్రస్తావిస్తూ, అమరావతికి అయ్యే ఖర్చులో కేవలం 10 శాతంతోనే మరుసటి రోజు నుంచే పూర్తిస్థాయి రాజధానిగా మార్చవచ్చని తెలిపారు. మావిగన్ ప్రాంతం అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వే కనెక్టివిటీ, పోర్టుతో అనుసంధానం అయిందని, అక్కడ పెట్టుబడి పెడితే తక్షణమే ఫలితం ఉంటుందని వివరించారు.

రాష్ట్ర వనరులను సక్రమంగా వినియోగించుకోవాలన్నదే జగన్ ఆలోచన అని, కానీ చంద్రబాబు కేవలం భ్రమలు సృష్టిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వృథా ఖర్చులను ఆపి, ఆచరణాత్మకమైన రాజధాని వైపు అడుగులు వేయాలని సజ్జల సూచించారు.

# యూపీలో పడవ బోల్తా... 10 మంది మృతి...

- మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో పడవ అదుపుతప్పి నదిపై ఉన్న ఫ్లోటింగ్ పాంటూన్ వంతెన (పైపా బ్రిడ్జి)ను ఢీకొట్టింది. దీంతో పడవ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయింది. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 14 మందిని కాపాడి ఆసుపత్రికి తరలించగా, 10 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు యమునా నదిలో తీవ్రంగా గాలిస్తున్నాయి.ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలను వేగవంతం

చేయాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం యోగి అధికారులను ఆదేశించారు. స్థానిక యంత్రాంగం బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## భాగ్యనగరంలో 'ప్రేమ' ముసుగులో

# మతం మార్పిడి దందా

- మొదటి పేజి తరువాయి

వంచన ఉదంతం నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రేమ పేరుతో వల వేయడం, ఆపై మతం మార్చుకోవాలంటూ తీవ్రస్థాయిలో వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు అన్నదమ్ముల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జమీర్, అతని తమ్ముడు మిరాజ్ కలిసి ఒక పక్కా ప్రణాళికతో అమాయక యువతులను ట్రాప్ చేస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ అన్నదమ్ములు ఇద్దరూ ఇప్పటివరకు సుమారు ఐదుగురు హిందూ యువతులను ప్రేమ పేరుతో నమ్మించి, వారి జీవితాలతో ఆడుకున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.నిందితుల్లో ఒకరైన జమీర్‌పై గతంలోనే పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదై ఉండటం గమనార్హం. ఒక మైనర్ బాలికను వేధించిన కేసులో జైలుకు వెళ్లి వచ్చినా, అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని పోలీసులు గుర్తించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత జమీర్ తన తమ్ముడు మిరాజ్‌తో కలిసి ఈ అరాచకాలను మరింత ముమ్మరం చేశాడు. తాజాగా మరో యువతిని తన ప్రేమ వలలో వేసుకున్న జమీర్, ఆమెను లొంగదీసుకున్న తర్వాత అసలు స్వరూపాన్ని బయటపెట్టాడు. సదరు యువతిపై అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా, ఆమెను తమ మతంలోకి మారాలని బలవంతం చేస్తూ తీవ్రమైన ఒత్తిడికి గురిచేశాడు. ఒకవేళ ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే ప్రాణాలు తీస్తామంటూ అన్నదమ్ములిద్దరూ కలిసి బాధితురాలిని బ్లాక్ మెయిలింగ్ చేసినట్లు సమాచారం.బాధితురాలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఈ అన్నదమ్ముల గుట్టు రట్టయింది. రంగంలోకి దిగిన పంజాగుట్ట పోలీసులు నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ అన్నదమ్ములు కేవలం ఇద్దరే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారా లేక వీరి వెనుక ఏదైనా పెద్ద ముఠా ఉందా అనే కోణంలో పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో, నిందితుల నుంచి ప్రాణహాని ఉన్న యువతులకు రక్షణ కల్పించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నగర నడిబొడ్డున మతం మార్పిడి లక్ష్యంగా జరుగుతున్న ఇటువంటి దాడులు స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

## భోగాపురం విమానాశ్రయం

# ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

# లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు.. కీలక వ్యాఖ్యలు చేసిన తెలంగాణ డీజీపీ

- మొదటి పేజి తరువాయి

వంటి కీలక నేతలు ఉండటం విశేషం. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, గత ఏడాదిన్నర కాలంలోనే మొత్తం 763 మంది మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి ప్రభుత్వానికి లొంగిపోయారని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల కూంబింగ్ కార్యకలాపాలు ముమ్మరం కావడంతో, తమ రక్షణ కోసం మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారేనని, తెలంగాణకు చెందిన వారు కేవలం ఒక్కరే ఉన్నారని డీజీపీ స్పష్టం చేశారు. ఒకప్పుడు సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీల్లో తెలంగాణ వాసుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేదని, కానీ ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు. సెంట్రల్ కమిటీలో 11 మంది నుంచి ఇద్దరు, స్టేట్ కమిటీలో 24 మంది నుంచి కేవలం ఇద్దరు మాత్రమే మిగిలారని, వారు కూడా త్వరలోనే లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన 42 మందికి పునరావాస ప్యాకేజీ కింద రూ. 1.93 కోట్ల నగదును అందజేయడంతో పాటు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారికి ప్రత్యేక ఆరోగ్య కార్డులను కూడా జారీ చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పునరావాస అవకాశాలను అందిపుచ్చుకుని, అడవి బాట పట్టిన వారంతా తిరిగి రావాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించకపోవడంపై ఆగ్రహం

**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 10 :** జగ్గంపేట లోని గుర్రప్పాలెం వెళ్లే రోడ్డులో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం పంచాయతీ డివిజనల్ డెవలప్మెంట్ అధికారి శ్యామల తనిఖీ చేశారు. చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు లో లోటుపాట్లు ఉండడంతో డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, పంచాయతీ కార్యదర్శి శివ పై ఆమె మండిపడ్డారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించరాదని రోడ్లపై కూడా చెత్త ఉంచరాదని సూచించారు. తడి చెత్త పొడి చెత్త ఎందుకు వేరువేరుగా తీసుకోవడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. చెత్త సేకరణలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# అదనపు డీజిల్ ట్యాంకులతో బస్సులు పట్టివేత






✸ కఠిన చర్యలు హెచ్చరిక

**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 10:** ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ బస్సుల తనిఖీల్లో భాగంగా భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన రెండు బస్సులను అధికారులు పట్టుకున్నారు.ఈ తనిఖీలు రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు.తనిఖీల సమయంలో ఎన్ ఎల్ 02బి6989,ఎన్ ఎల్ 02బి4664 నంబర్ల బస్సుల్లో ఎటువంటి పరిమితులు లేకుండా ప్రమాదకరంగా అదనపు డీజిల్ ట్యాంకులు అమర్చినట్లు గుర్తించారు.ఈ బస్సుల్లో ప్రయాణికులు బెంగళూరు, తిరువన్నామలై ప్రాంతాలకు ప్రయాణిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.భద్రతా కారణాల దృష్ట్యా ఈ వాహనాలను కాకినాడలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిలిపివేశారు. డీజిల్ ధరలు తక్కువగా దొరుకుతాయనే ఉద్దేశంతో అధిక పరిమాణంలో డీజిల్ నిల్వ చేసుకోవడం ద్వారా వాహన యజమానులు ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వాహనం అత్యవసర ద్వారాలు (ఎగ్జిట్‌లు), భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే ఇలాంటి వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉప రవాణా కమిషనర్ హెచ్చరించారు.

# వైసిపి కార్యకర్తలకు నిరుపేదలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా.




✸ వైసిపి నేత ముదునూరి మురళీకృష్ణంరాజు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఏప్రియల్ 10:**వైసిపి కార్యకర్తలకు, నిరుపేదలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ప్రత్తిపాడు వైసిపి నాయకులు, నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు.

ప్రత్తిపాడు మండలం గజ్జినపూడి గ్రామంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, కుమ్మరి శాలివాహనం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అనకాపల్లి నూకరాజు ఇటీవల కాలంలో ఆరోగ్యం బాలేని కారణంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుకున్న మురళీకృష్ణంరాజు నూకరాజును పలకరించి వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకోవడమే కాకుండా,10,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసి వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా కల్పించారు.శంఖవరం అన్నవరం గ్రామానికి చెందిన గంపల శివప్రసాద్ కుటుంబానికి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. గంపల శివప్రసాద్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మురళీకృష్ణంరాజు వారి కుటుంబాన్ని పరామర్శించి శివప్రసాద్ భార్య అనూష కు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్,,గజ్జినపూడి ఎంపీటీసీ మొల్లి వీరబాబు,శరభవరం ఎంపీటీసీ అమరాది కాశీ ,ప్రత్తిపాడు ఎంపీటీసీ సేంద్రిపు భాస్కర్ రావు,వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు రంగనాథం అబ్బాయి,గోనగల అజయ్,గోనగల వెంకటరమణ ,అమరాది బాబ్జి,కోలా తాతబాబు,జువ్వల దొరబాబు,వార్డ్ నెంబర్ తాళ్లపూడి బుజ్జి,వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం

## -- అధికారులకు జేసీ అపూర్వ భరత్ ఆదేశాలు





**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 10:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు.శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో లబ్ధిదారుల సంతృప్తి స్థాయి 100 శాతం సాధించే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు.గత మూడు నెలల్లో జిల్లాలో మొత్తం 51,002 అర్జీలు అందగా, వాటిలో 45,126 అర్జీలు పరిష్కరించామని, ఇంకా 1,747 అర్జీలు పరిష్కార దశలో ఉన్నాయని తెలిపారు. వివిధ శాఖల హెచ్ఓడీలు అర్జీలను వ్యక్తిగతంగా పర్యవేక్షించి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి తగిన పరిష్కారం అందించాలన్నారు. అర్జీదారుల అభిప్రాయం, సిటిజన్ ఫీడ్‌బ్యాక్, పబ్లిక్ పర్సెప్షన్ మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రతి నెల రెండవ శుక్రవారం పీజీఆర్ఎస్ అర్జీలపై సమీక్ష నిర్వహిస్తామని, అన్ని శాఖల అధికారులు అందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎల్డీవో వాసుదేవరావు మరియు ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సమిష్టి నిర్ణయాలతో పురోగమనం.



✸ ఏకపక్ష నిర్ణయాలతో తిరోగమనం.

✸ ఎమ్మెల్యే నెహ్రూ పునరాలోచించాన్న పాటంశెట్టి సూర్యచంద్ర.

**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్, 10:**జగ్గంపేట నియోజకవర్గంలో గోకవరం మండలం గాదెలపాలెం నుండి కిర్లంపూడి మండలం కృష్ణవరం వరకు ఉన్న 73 కిలోమీటర్ల పోలవరం లెఫ్ట్ కెనాల్ సంబంధించిన 850 ఎకరాల భూమిలో మట్టి తొలగించి 26 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తామని శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ప్రతిపాదనలు సిద్ధం చేయటం ద్వారా నూతన గృహాల కోసం ఎదురు చూస్తున్న నిరుపేదలకు నష్టం చేకూరే అవకాశం ఉందని పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు.గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జగ్గంపేట నియోజకవర్గంలో సుమారు 15 వేల మందికి జగనన్న ఇళ్ల పట్టాలు ఇచ్చారని దానికి సంబంధించి సేకరించిన భూమిలో సైట్ ఫిల్లింగ్ పేరుతో నాడు ఎన్నో అక్రమాలు జరిగాయని 20 శాతం మంది కట్టుకున్నారని 80 శాతం మంది ఇచ్చిన పట్టా భూమి నివాసాలకు అనుకూలంగా లేకపోవడంతోను,కోర్టులలో పెండింగ్ ఉండడంతో సామాన్యులంతా ఎన్నో అవస్థలుపడుతున్నారన్నారు.నేడు మళ్ళీ పోలవరం భూమి ఇవ్వడం వల్ల పోలవరం భూమిలో నష్టపోయిన రైతులు భవిష్యత్తులో కోర్టుకు వెళ్లి న్యాయం కోసం పోరాడే అవకాశాలు ఎక్కువ ఉంటాయన్నారు.ఆ పరిస్థితుల్లో మళ్ళీ స్థలాల కోసం ఎదురుచూస్తున్న పేదలందరికీ నిరాసే అవుతుందన్నారు.భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి గ్రామంలోనూ భూమి ఇచ్చిన రైతులకు నష్టం లేకుండా ఎక్కువ ధర చెల్లించి ప్రభుత్వం తరపున ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి పేదలకు పట్టాలిచ్చి గృహాలు నిర్మించాలని పాటంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని ,శాసనసభ్యులను కోరారు.నేషనల్ హైవే విస్తరణలో భాగంగా జగ్గంపేటలో ఎలివేటెడ్ క్యారిడార్ బ్రిడ్జ్ నిర్మాణం మంచిదా, బైపాస్ రోడ్డు నిర్మాణం మంచిదా అనేది జగ్గంపేట నియోజకవర్గంలో ఉన్న రైతులతోను,

వ్యాపారస్తులతోనూ, అనుభవజ్ఞులతోనూ సమావేశాలు నిర్ణయించి అంతిమ నిర్ణయం తీసుకోవాలని సూర్యచంద్ర కోరారు. కొందరి కోసం తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల ఒక్కోసారి భర్తీ చేయలేని భారీ నష్టం జరుగుతుందని, సమిష్టి నిర్ణయాలు అందరి అభిప్రాయాలు తీసుకోవడం వల్ల మంచి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధమవుతాయని శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఎలివేటెడ్, బైపాస్ రోడ్డు నిర్మాణంపై పునరాలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని సూర్యచంద్ర సూచించారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఏలేరు ఆధునీకరణ చేస్తామన్న వాగ్దానాన్ని నిలబెట్టుకుని ఏలేరు ఆధునీకరణకు రెండు వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించి శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచించాలని తాత్కాలిక పనుల వల్ల రాజకీయ నాయకులు జేబులు నిండుతాయి తప్పించి రైతులకు ఉపయోగం లేదన్నారు.తక్షణం ఏలేరు ఆధునికరణ చేపట్టాలని సూర్యచంద్ర రైతుల పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

జగ్గంపేట నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ మట్టి గ్రావెల్ మరియు ఇతర అనేక అవినీతి కార్యక్రమాలను ప్రజలు నాయకులు ప్రశ్నించాలని మనకు సంబంధం లేదు కదా అని ఊరుకుంటే జరిగే నష్టం ప్రజలకే అన్నారు.గ్రావెల్ మట్టి ద్వారా ప్రభుత్వానికి కట్టే డబ్బులు పంచాయితీకి 25 శాతం, మండలానికి 50 శాతం, జిల్లా పరిషత్ కు 25 శాతం వస్తుందని తద్వారా అన్ని గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు జరుగుతాయని సూర్యచంద్ర తెలిపారు.జగ్గంపేటలో నిర్మించిన కాపు కళ్యాణ మండపాన్ని సామాన్యులకు వివాహాలు, ఫంక్షన్లు జరిగే విధంగా ప్రజలకు అందించాలని పాటంశెట్టి సూర్యచంద్ర కోరారు

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మున్సిపల్ కార్యాలయంలో జనగణన శిక్షణా తరగతులు

**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 10 :**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణనను విజయవంతంగా పూర్తి చేయడానికి పట్టణ ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్, ఛార్జ్ ఆఫీసర్ టీవీ రంగారావు కోరారు. జనగణన 2027 ప్రక్రియకు సంబంధించిన గణనదారుల (ఎన్యూమరేటర్లు) శిక్షణా తరగతులు మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛార్జ్ ఆఫీసర్ రంగారావు మాట్లాడుతూ మొత్తం 118 మంది గణనదారులు, 12 మంది రిజర్వ్ గణనదారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. శిక్షణను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బందిని మూడు బ్యాచ్‌లుగా విభజించామని చెప్పారు. మొదటి బ్యాచ్ ఈ నెల 9 నుంచి 11 వరకు, రెండవ బ్యాచ్ 15 నుంచి 17 వరకు, మూడవ బ్యాచ్ 20 నుంచి 22 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన సిబ్బంది మే 1 నుంచి 30 వరకు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని చెప్పారు. గణనదారులు ఇళ్లకు వచ్చినప్పుడు వారికి సరైన సమాచారం అందించి సహకరించాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



## ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకే ప్రజాదర్బార్



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 10**: ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేట రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలు స్వీకరించారు. పలు సమస్యలపై వినతులు అందగా అందులో పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రజల నుంచి అందిన ప్రతీ వినతి పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా దర్బార్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, పాటంశెట్టి రవి, కర్ణాకుల వీరాంజనేయులు, పాఠం శెట్టి కొండ రాజులు, తోట వెంకటేశులు, కర్ణాకుల సత్తిబాబు, కర్నాకుల సూరిబాబు, పాఠం శెట్టి గణేష్, స్వర్ణాంధ్ర టీం సభ్యులు కుటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై ఉపాధి కూలీలకు అవగాహన



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 10** : జగ్గంపేట మండలం సీతానగరం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు శుక్రవారం జగ్గంపేట ఎస్ ఐ టి.రఘునాథరావు మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ పై అవగాహన కల్పించారు. ప్రజలు అవగాహన లోపంతో సైబర్ నేరాలకు గురవుతున్నారన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం అంటే ఎటువంటి వివరాలు చెప్పరాదని వివరించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణ పై తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. మహిళా హక్కు చట్టాల కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధి కూలీలు ఉన్నారు.ద

## రోడ్డు పనుల పేరుతో చెట్ల తొలగింపు... స్థానికుల్లో ఆవేదన

- అభివృద్ధి పనులా... లేక ప్రకృతి నాశనమా?





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 10:** ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగించే ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఒక వైపు ప్రభుత్వం విస్తృతంగా మొక్కలు నాటాలని పిలుపునిస్తుండగా, మరో వైపు అభివృద్ధి పనుల పేరుతో చెట్ల తొలగింపు కొనసాగుతుండటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రత్యేకంగా ర్యాలి నుంచి ఊబలంకకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లను ఇటీవల తొలగించడం చర్చనీయాంశంగా మారింది. ఈ చెట్లు వేసవి కాలంలో ప్రయాణికులకు చల్లని నీడను, స్వచ్ఛమైన గాలిని అందించేవని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు మరమ్మత్తుల పనులకు అడ్డుగా ఉన్నాయని పేర్కొంటూ మొదట కొమ్మలను మాత్రమే తొలగించాల్సి ఉండగా, పూర్తి స్థాయిలో చెట్లను నరికివేయడం జరిగిందని వారు ఆరోపిస్తున్నారు.

"చెట్లు తొలగించడం వల్ల ప్రాంతం వేడి తీవ్రత పెరిగే అవకాశం ఉంది. పర్యావరణానికి ఇది నష్టం" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి అవసరం ఉన్నప్పటికీ, పర్యావరణాన్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు చెట్ల తొలగింపుపై స్పష్టత ఇవ్వాలని, తొలగించిన చెట్ల స్థానంలో కొత్త మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో "మల్టీమోడల్ ఏఐ ఫ్యూజన్ : జెనరేటివ్ ఏఐ నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ కంప్యూటర్ విజన్ " అనే అంశం పై మూడు రోజుల వర్క్ షాప్





**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 10**
ప్రగతి ఇంజనీరంగ్ కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ & మెషిన్ లెర్నింగ్ విభాగం వారి ఆధ్వర్యంలో బి.టెక్ మూడవ సంవత్సరం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ & మెషిన్ లెర్నింగ్ విద్యార్థినీ, విద్యార్థులకు ఏప్రియల్ 8 వ తేదీ నుండి 10 వ తేదీ వరకు "మల్టీమోడల్ ఏఐ ఫ్యూజన్ జెనరేటివ్ ఏఐ నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ & కంప్యూటర్ విజన్ " అనే అంశం పై మూడు రోజుల పాటు స్టూడెంట్ వర్క్షాప్ నిర్వహించామని కళాశాల చైర్మన్ డా, పరుచూరి కృష్ణారావు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్గా డా, మస్జిద్ షేక్, జెటాకోడింగ్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్, బెంగళూరు వారు విచ్చేసారని తెలియజేసారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఇటువంటి నూతన టెక్నాలజీల గురంచి విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ వారిని భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే మంచి ఇంజనీర్లుగా తయారు చేస్తోందని పేర్కొన్నారు.
ఈ వర్క్షాప్ ఏఐ టూల్స్ ఉపయోగించి ప్రాజెక్ట్, ఛాట్ బోట్ వంటివి ఎలా అభివృద్ధి చేయవచ్చో, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ఎలా పనిచేస్తాయో సవివరంగా వివరించడం జరిగినది.
ఈ కార్యక్రమం లో కళాశాల డైరెక్టర్ మానేజ్మెంట్ ఎం. వి. హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం. సతీష్, డైరెక్టర్-అకడమిక్స్ డా॥ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డా॥ జి.నరేష్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ & మెషిన్ లెర్నింగ్ విభాగాధిపతి డా॥ ఎ. రాధాకృష్ణ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత రక్తదాన శిబిరం



**అల్లవరం, పెన్ పవర్, ఏప్రిల్ 10:** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 వ పుట్టిన రోజుసందర్భంగా శుక్రవారం అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ రాకేష్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అల్లవరం మండలం టీడీపీ నాయకులు,హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ మెంబర్ బండిగుప్తపు సత్యనారాయణ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు డాక్టర్ ఎన్ రాకేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయటం వల్ల ప్రాణాపాయం స్థితిలో ఉన్నవారిని కాపాడవచ్చనే ఉద్దేశం తో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసాము అని తెలిపారు. ఈ కార్యక్రమం లో హాస్పిటల్ డాక్టర్స్,సిబ్బంది, యువకులు ఉత్సాహంగా పాల్గొని 25 ప్యాకెట్స్ రక్తదానం చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లవరం హాస్పిటల్ డాక్టర్స్,సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో హోమియోపతి దినోత్సవం





**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 10:** కాకినాడ లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ హోమియోపతి దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు హోమియోపతి వైద్యంపై అవగాహన కల్పించినట్లు కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు తెలిపారు. హోమియోపతి పితామహుడు సామ్యూల్ హనిమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య క్రమానికి అధ్యక్షత వహించిన డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ, విద్యార్థులకు వివిధ వ్యాధులు మరియు వైద్య విధానాలపై అవగాహన అవసరమని చెప్పారు. ఇతర వైద్య విధానాలతో పోలిస్తే హోమియోపతి సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్య విధానమని ఆయన సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. శారీరక,మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ లక్ష్యాల వైపు ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సూర్య చంద్ర హోమియోపతి హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ సూర్యకిరణ్ సలాది మాట్లాడుతూ,హోమియోపతిలో సామ్యూల్ హనిమాన్ చేసిన పరిశోధనలను వివరించారు. విద్యార్థులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సాధారణ ఆరోగ్య సమస్యలు మరియు వాటి పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. హోమియోపతి వైద్య సేవల ప్రాముఖ్యతను వివరించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మానికిరెడ్డి సత్య నారాయణ మాట్లాడుతూ,తనకు ఎదురైన ఆరోగ్య సమస్యలలో హోమియోపతి ఎంతో ఉపయోగ పడిందని తెలిపారు. విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని, ముఖ్య అతిథి డాక్టర్ సూర్యకిరణ్ సలాదిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు,డి.అశ్విని,వాలంటీర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జగపతినగరంలో ఉపాధి కూలీలకు కిర్లంపూడి ఎస్సై,జి సతీష్ స్నేహ పూర్వక అవగాహన.

-కిర్లంపూడి ఎస్సై జి సతీష్ విధినిర్వహణ పట్ల ప్రసంశల జల్లు



**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్ 10:** కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలకు తనదైన శైలిలో పలు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో పాటు ఎస్సై జి సతీష్ క్రింద కూర్చుని వారితో సోదర భావంగా, స్నేహపూర్వకంగా పలు అంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా, ఒక కుటుంబ సభ్యుడి లాగ మాట్లాడిన తీరు పట్ల పలువురు ఉపాధి కూలీలు ఎస్సై తీరు పట్ల ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఈ అవగాహనా కార్యక్రమంలో ఎస్సై జి సతీష్ మాట్లాడుతూ పిల్లల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాడమే కాకుండా, వారి చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మనం ఎంత ఆస్తి సంపాదించి వారికి ఇచ్చినా నిలబడదని, చదువు ఒక్కటే సంస్కారంతోపాటు ఐశ్వర్యవంతున్ని చేస్తుందన్నారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని,అపరిచిత లింకులు, కాల్స్‌కి స్పందించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. హెల్మెట్ వినియోగం ప్రాణాలను కాపాడుతుందని ఉపాధి హామీ కూలీలకు వివరించారు. ఏ ఉద్యోగి అయినా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ప్రజా మన్ననలు పొందుతారనడానికి కిర్లంపూడి ఎస్సై,జి సతీష్ నిదర్శనం.

## నన్నయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

-- తాతపూడి వెంకటేశ్వరరావుకు పిహెచ్.డి. ప్రదానం





**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 10:** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 16వ మరియు 17వ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రసన్నకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా అబ్దుల్ నజీర్ హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జాతీయ భద్రతా మండలి సలహాదారు మహేంద్ర పి. లామా, ఏపీఎస్సీహెచ్ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ కోత మధు మూర్తి తదితరులు పాల్గొన్నారు. కాకినాడ జిల్లా నుంచి తాతపూడి వెంకటేశ్వరరావుకు పిహెచ్.డి. డిగ్రీ ప్రదానం చేయడం విశేషంగా నిలిచింది. ఆయన పి.ఆర్. గవర్నమెంట్ కళాశాల (అటానమస్), కాకినాడకు చెందినవారు. 141 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ కళాశాలకు, అలాగే జువాలజీ విభాగానికి ఇదే మొదటి డాక్టరేట్ అవార్డు రావడం గర్వకారణంగా నిలిచింది. వెంకటేశ్వరరావు "ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ బేలో స్టేబుల్ కార్బన్ (ΔΙ3C) మరియు నైట్రోజన్ (ΔΙ5N) ఐసోటోపిక్ సిగ్నేచర్లు: పార్టిక్యులేట్ ఆర్గానిక్ మ్యాటర్ మరియు జూప్లాంక్టాన్ విశ్లేషణ" అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్.డి. పూర్తి చేశారు. మూడు సంవత్సరాల పాటు కాకినాడ బేలోని 11 స్టేషన్లలో అధ్యయనం నిర్వహించి, కార్బన్-నైట్రోజన్ ఐసోటోప్ విశ్లేషణ ద్వారా సముద్ర జీవవ్యవస్థలో ట్రోఫిక్ డైనమిక్స్, ఫుడ్ వెబ్ ఎనర్జీ మార్పిడి ప్రక్రియలను విశ్లేషించారు. ఈ పరిశోధనను జువాలజీ విభాగానికి చెందిన డాక్టర్ ఎన్. శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో పూర్తి చేసినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి. పిహెచ్.డి. అందుకున్న సందర్భంగా కాజులూరు మండలం కయ్యేరు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తన తల్లిదండ్రులు వాడపల్లి, రత్నమ్మ ఆశయాలను నెరవేర్చడానికి కష్టపడి చదివానని, ఈ విజయంతో ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

# రికార్డు స్థాయిలో ఇంటి పన్నుల వసూళ్లు చేసిన ఆలమూరు



- ఆన్ లైన్ ద్వారా రూ.కోటి 99 లక్షలు జమ
- నాలుగు పంచాయతీలు నూరు శాతం వసూళ్లు

**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 10;**ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నూతనంగా ప్రవేశపెట్టిన ఆన్ లైన్ ఇంటి పన్నుల విధానం అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. ప్రతి ఇంటి పన్నును నేరుగా ఆన్ లైన్లో నే జమ కావాలని స్వర్ణ పంచాయితీ విధానాన్ని తీసుకొస్తే చాలామంది సాధ్యపడదని ఎద్దేవా చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆన్ లైన్ పేమెంట్ అంటే ఎలా వీలు పడుతుందని ప్రశ్నించారు. కాని ఫలితాలు అద్భుతంగా వచ్చాయి. పూర్తి గ్రామీణ ప్రాంతంగా ఉండే కొత్తపేట డివిజన్ ఆలమూరు మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల ద్వారా మునుపెన్నడూ లేనివిధంగా రూ.కోటి98 లక్షల 69 వేలు వసూలు చేశారు. సాధారణంగా ఆర్థిక సంవత్సరం మార్చి 31కి ముగిసినప్పటికీ గతంలో జూన్, జూలై వరకూ పన్నుల వసూళ్లు కొనసాగుతూ ఉండేవి. కానీ ఇప్పుడు ఆన్ లైన్ విధానవల్ల 2025-25 ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు మార్చి 31తో వసూళ్ల ఆన్ లైన్ సైట్ నిలిపేశారు. అయినప్పటికీ ఇంత అధిక మొత్తంలో వసూళ్లు రావడం విశేషం.ఎంపీడీవో ఎ.రాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు ఈ పన్నుల వసూళ్లలో నిమగ్నమయ్యారు. మొత్తం 16,793 ఇంటి యజమానుల నుంచి ఈ సొమ్మును వసూలు చేశారు.గతేడాది ఒక్క పంచాయతీ కూడా నూరు శాతం పన్నులు వసూలు చేయలేదు. పన్ను బకాయిలు రూ. 41.95 లక్షలు ఉన్నాయి. 25-26 సంవత్సరానికి రూ.కోటి 83 లక్షలు వసూలు చేయాలి. మొత్తం రూ.2.25 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా అందులో 88.3 శాతం వసూళ్లు చేయడం విశేషం. వీటిల్లో నవాబుపేట జనవరి నెలలోనే నూరు శాతం వసూలు చేసి అవార్డును దక్కించుకుంది. అలాగే నర్సిపూడి,కలవచర్ల, సూర్యారావుపేట గ్రామపంచాయతీలు కూడా నూరు శాతం పన్నులు వసూలు చేశాయి. ఇవి కాకుండా 90 శాతం పైబడి ఏకంగా 8 గ్రామ పంచాయతీలు పన్నులు వసూలు చేశాయి. వాటిల్లో గుమ్మిలేరు రూ.8.69లక్షలు(98.19 శాతం), మూలస్థానం రూ.10.24లక్షలు (97.43 శాతం) చింతలూరు రూ 11.93 లక్షలు(94.76శాతం), పినపళ్ల రూ. 14.53 లక్షలు (94.05శాతం), పెనికేరు రూ.7.37 లక్షలు (92.82 శాతం), సందిపూడి రూ.5.08 లక్షలు (90.88 శాతం), చెముడులంక రూ.10.54 లక్షలు (90.47 శాతం), బడుగువానిలంక రూ.5.47 లక్షలు (90.12 శాతం) వసూళ్లు చేసాయి.ఇక పెదపళ్ల రూ.17.26 లక్షలు(88.38 శాతం), జొన్నాడ రూ 17.53 లక్షలు (87.91 శాతం),చొప్పెల్ల రూ. 12.7 లక్షలు (86.81 శాతం).ఆలమూరు రూ.32.41 లక్షలు (82.18 శాతం),మడికి రూ.17.86 లక్షలు (78.2 శాతం) మోదుకూరు రూ. 8.58 లక్షలు (74. 74 శాతం) వసూళ్లు చేసారు.సొమ్ము వసూళ్లు చేసింది 88.3 శాతం కాగా గృహ యజమానులు(అసెస్మెంట్లు)సంఖ్య పరంగా వసూళ్లు చేసింది 92.12 శాతం. అంటే ప్రభుత్వ,ప్రవేటు సంస్థల నుంచి రావాల్సిన బకాయిలు ఎక్కువగా ఉన్నాయి.ఏది ఏమైనా వసూళ్ళు చేసిన పన్నులు గ్రామ పంచాయతీ ఖాతాలకు జమ కాలేదనే ఆరోపణలకు తావు లేకుండా ఈ ఆన్ లైన్ పేమెంట్ విధానం ఎంతగానో దోహదపడింది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పోగొట్టుకున్న బంగారాన్ని మూడు గంటల్లో తిరిగి అప్పగించిన జగ్గంపేట పోలీసులు




**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 10:** జగ్గంపేటకు చెందిన మహిళ తన కుమారుడితో శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి సామర్లకోట రైల్వే స్టేషన్ కు వచ్చారు. అయితే ఆమె సామర్లకోట రైల్వే స్టేషన్ నుంచి వారి స్వగ్రామం జగ్గంపేటకు ఆటోలో బయలుదేరి గమ్యస్థానమైన జగ్గంపేట చేరుకున్నారు. అయితే ఇదిలా ఉండగా వారు ఆటో దిగి కొంత దూరం వచ్చిన తర్వాత ఆటోలో వారి యొక్క బ్యాగు మర్చిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆ బ్యాగ్ లో దుస్తులతో పాటు సుమారు రూ.4.5 లక్షల విలువగల 34 గ్రాములు బంగారు వస్తువులు ఉండడంతో ఆమె వెంటనే జగ్గంపేట పోలీసులను ఆశ్రయించారు. దీనిపై తక్షణం స్పందించి జగ్గంపేట సిఐ బి. తిరుపతిరావు, జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు రెండు బృందాలుగా ఏర్పడి ఆటో ఆచూకీ కోసం రంగంలోకి దిగారు. జగ్గంపేట పోలీస్ స్టేషన్ లోని సిసి ఫుటేజ్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీసీ కెమెరాలు, దేవి సెంటర్లోని సీసీ కెమెరాలు, కాకినాడ రోడ్ లోని కాట్రావులపల్లి గ్రామంలో ఉన్న ప్రధాన సీసీ కెమెరాల ఫుటేజ్ లను క్షుణ్ణంగా పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆటోను గుర్తించారు. కేవలం మూడు గంటల వ్యవధిలో కేసును చేదించి, ఆటోలో ఉన్నటువంటి ఆ బ్యాగును, బ్యాగ్ లోని విలువైన బంగారం వస్తువులను ఆ మహిళకు జగ్గంపేట పోలీసులు అప్పగించారు. దీంతో గంటల వ్యవధిలో పోగొట్టుకున్న బంగారం తిరిగి దక్కించుకోవడంతో ఆ మహిళ హర్షం వ్యక్తం చేస్తూ జగ్గంపేట పోలీస్ సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆటోలలో, బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు మీ యొక్క విలువైన వస్తువుల పట్ల అజాగ్రత్తగా ఉండరాదని జగ్గంపేట సిఐ తిరుపతరావు సూచించారు.

## జగ్గంపేటలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 10:** జగ్గంపేట మండల వ్యవసాయ కార్యాలయంలో ఏడిఏ జి.శ్రీనివాస్ అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న తొలకరికి ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. దానికి అనుగుణంగా పిఎండిఎస్ కిట్లను రైతుల చెరువులో ఉండేలా వర్షం పడిన వెంటనే విత్తనాలు చల్లుకునే విధంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. మొదటి రోజున రాజపూడి గ్రామంలో ద్రవజీవామృతం తయారీ, విత్తన గులుకుల తయారీ, ప్రకృతి వనరుల కేంద్రం మరియు ముందుగా వేసిన పిఎండిఎస్ ప్లాట్ ను సిబ్బంది అందరికీ కూడా చూపించడం వాటి యొక్క ఉపయోగాన్ని వారు అవగాహన కలిగించుకునేలా సూచనలు ఇవ్వడం జరిగింది. అంతేగాక ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ కి సిద్ధంగా ఉండాలని రైతులు కావలసిన విత్తనాలను అందుబాటులో ఉంచాలని వాటిని సర్టిఫికేషన్ అయిందో లేదో కూడా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం, ఏఈఓ పి.చంద్రమౌళి, డిస్టిక్ ట్రైనర్, టీం సభ్యులు చందకు అప్పలస్వామి, పడాలి రాజేష్, రేగళ్ల వీర రాఘవ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు పీఎం సూర్య ఘర్ పథకం వరం -- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్ 10:**ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకం వరం లాంటిదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.కొత్తపేట నియోజకవర్గంలో బిళ్ళకుర్రు సబ్‌స్టేషన్ వద్ద రూ.1.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 11 కెవి లైన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 11 కెవి బ్రేకర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సదుపాయంతో మోడేకుర్రు, గొలకోటివారిపాలెం గ్రామాలకు 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందనున్నట్లు తెలిపారు. అనంతరం గోగువారిపేటలో పీఎం సూర్య ఘర్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ యూనిట్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలతో ఈ పథకం అమలవుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 2 కిలోవాట్ సామర్థ్యంతో ఉచితంగా సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసి నెలకు సుమారు 240 యూనిట్ల విద్యుత్ అందించడమే లక్ష్యమన్నారు.

ఈ పథకం కింద రూ.1.50 లక్షల విలువైన సౌర యూనిట్‌ను ఉచితంగా అందజేస్తున్నారని, వినియోగానికి మించి ఉత్పత్తి అయిన విద్యుత్తును విద్యుత్ సంస్థలకు విక్రయించి అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. అదనంగా లబ్ధిదారులకు నెలకు రూ.200 అద్దె, సంవత్సరానికి రూ.2400 చెల్లింపు కూడా లభిస్తుందని వివరించారు.

కొత్తపేట నియోజకవర్గంలో ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 12,243 మందిని గుర్తించినట్లు తెలిపారు. వీరిలో ఇప్పటికే 3,278 మంది ఈ పథకంలో చేరారని, అందులో 3,189 మంది ఎస్సీ, 89 మంది ఎస్టీ లబ్ధిదారులు ఉన్నారని వెల్లడించారు. అర్హులైన వారందరికీ ఉచిత సౌర యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఇంకా అవగాహన లోపం వల్ల కొందరు ఈ పథకానికి దూరంగా ఉన్నారని, దీనివల్ల లభించే ప్రయోజనాలను గ్రహించి మరింత మంది ముందుకు రావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ పథకం ద్వారా ఉచిత విద్యుత్‌తో పాటు ఆదాయం పొందడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని చెప్పారు.

అదేవిధంగా ఓసీ, బీసీ, ఈబీసీ వర్గాలవారు 3 కిలోవాట్ సౌర ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే రూ.78,000 సబ్సిడీతో పాటు రూ.1.20 లక్షల బ్యాంకు రుణ సదుపాయం కూడా పొందవచ్చని తెలిపారు.

ఈ సందర్భంగా సౌర ప్యానెల్స్ ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులను ఎమ్మెల్యే అభినందించారు.

## గొల్లపాలెంలో పోషణ పక్వాడపై అవగాహన కార్యక్రమం



**కాజులూరు, పెన్ పవర్,ఏప్రిల్ 10:** మహిళలు, పిల్లల ఆరోగ్యాభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న పోషణ పక్వాడ కార్యక్రమాలపై గొల్లపాలెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (తాళ్లరేవు ఐసిడిఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది.సీడీపీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గొల్లపాలెం సెక్టార్ సూపర్వైజర్ రమణమ్మ సమక్షంలో అంగన్వాడీ వర్కర్లు, తల్లులకు పోషణ పక్వాడ కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానం గురించి వివరించారు. ఏప్రిల్ 9 నుంచి 23 వరకు 15 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో రోజువారీ చర్యల ప్రణాళిక (డే-వైజ్ యాక్షన్ ప్లాన్)పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల పోషణ, ఆరోగ్య సంరక్షణ, సమతుల ఆహారం, హెల్తీ స్నాక్స్, వీనింగ్ ఫుడ్ ప్రాముఖ్యత, ఆట ఆధారిత విద్య, కుటుంబ సభ్యుల పాత్ర వంటి అంశాలను వివరించారు. ముఖ్యంగా తల్లులు, అంగన్వాడీ సిబ్బంది కలిసి పిల్లల పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అలాగే ప్రతి రోజు నిర్వహించే కార్యక్రమాల్లో గ్రామస్థుల భాగస్వామ్యం,ఫోటోలు, రిపోర్టింగ్,లైన్ డిపార్ట్మెంట్ల సమన్వయం అవసరాన్ని వివరించారు.పోషణ పక్వాడ ద్వారా సమాజంలో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించుకోవచ్చని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గాడి మొగ సూపర్వైజర్ కనక రత్నం,అంగన్వాడీ వర్కర్లు, తల్లులు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ 135వ జయంతి వేడుకలకు ఆహ్వానం

**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 10:** డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా విభాగం ఆధ్వర్యంలో కాకినాడలో అధికారిక వేడుకలు నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఏప్రిల్ 14 మంగళవారం ఉదయం 9.00 గంటలకు స్థానిక ఇంద్రపాలెం బ్రిడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పూలమాలలు అర్పించి నివాళులు ఘటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రజలందరూ హాజరైవిజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## గొల్లపాలెంలో యువకులపై దాడి

- ఏడుగురిపై కేసు నమోదు

**కాజులూరు, పెన్ పవర్,ఏప్రిల్ 10:** మండల పరిధిలోని గొల్లపాలెం గ్రామంలో పాత వివాదం కారణంగా ఇద్దరు యువకులపై దాడి జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై గొల్లపాలెం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం... ధర్మాడి హరి వీర భద్రరావు (21), సాయిబాబా టెంపుల్ స్ట్రీట్, గొల్లపాలెం గ్రామానికి చెందినవాడు. ఏప్రిల్ 9 రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో తన స్నేహితుడు వానమాడి వీరబాబుతో కలిసి సాయిబాబా టెంపుల్ వీధిలో సిమెంట్ టేబుల్ వద్ద కూర్చున్నాడు. అదే సమయంలో మణి, హర్ష, వంశీ, ప్రసాద్, మహేష్, చక్రి, సాయి అనే ఏడుగురు అక్కడికి చేరుకుని కర్రలతో దాడి చేశారు.ఈ దాడిలో హరి వీర భద్రరావుకు తల ఎడమ భాగంలో వాపు గాయాలు, చేతికి గాయాలు కాగా, అడ్డుకునేందుకు వచ్చిన వానమాడి వీరబాబుపై కూడా దాడి చేసి కుడి కనుబొమ్మ, తల భాగంలో గాయపరిచారు.గాయపడిన ఇద్దరినీ వెంటనే జీజీహెచ్ ఆసుపత్రి, కాకినాడ కు తరలించి చికిత్స అందించారు. ఆసుపత్రి సమాచారం మేరకు ఏప్రిల్ 10 ఉదయం 10 గంటలకు కేసు నమోదు చేశారు.ఈ ఘటనకు పూర్వ వివాదమే కారణమని పోలీసులు తెలిపారు. ఈ మేరకు క్రైం.నెం 64/2026 బిఎన్ ఎస్ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్ల పాలెం ఎస్సై ఎం మోహన్ కుమార్ మీడియాకు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కాజులూరు, పెన్ పవర్,ఏప్రిల్ 10**: ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది.శనివారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు 33/11 కేవీ కుయ్యేరు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ దుగ్గుదుర్రు ఫీడర్‌లో లైన్ మరమ్మత్తు పనులు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది.ఈ కారణంగా దుగ్గుదురు, దుగ్గుదుర్రు పాటి, మెకలగరువు, ఉప్పుమిల్లి, చింతల్లంక, రేగుబడవ గ్రామాలు అలాగే సంబంధిత ఇండస్ట్రియల్ మరియు ఆక్వా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదు.కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఎన్. ఉదయ భాస్కర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్ ఆపరేషన్),కాకినాడ వారు విజ్ఞప్తి చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 10 :** జగ్గంపేట మండలం ఇర్రిపాక సబ్ స్టేషన్ మెయింటినెన్స్ కారణంగా ఈ నెల 11వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి వీరభద్రరావు, ఏఈ మాధురి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఇర్రిపాక, మామిడాడ, మర్రిపాక గ్రామాలకు మరియు బోరులకు, నరేంద్రపట్నం, రామవరం బోరులకు, మర్రిపాక చేపల చెరువులకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులంతా గమనించి సహకరించాలని కోరారు.

# జగ్గంపేటలో జన గణనపై శిక్షణ




**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 10:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత రెండు రోజుల నుంచి జనగణన-2027 పై ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జగ్గంపేట తహసిల్దార్ జెవిఆర్ రమేష్ తెలిపారు. జన గణనకు సంబంధించి జగ్గంపేట మండలంలో 135 బ్లాకులుగా కేటాయించామని, 135 మంది ఎన్యూమరేటర్లను, 25 మంది సూపర్వైజర్ లను నియమించినట్లు తెలిపారు. శిక్షణ పొందిన సిబ్బంది జనగణనను సమర్ధవంతంగా చేయాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి జనాభా లెక్కల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు.

# మల్లిశాల గ్రామంలో పోషణ్ పక్వాడ




**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 10:** జగ్గంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పూర్ణిమ ఆధ్వర్యంలో ఈ నెల 9 వ తేది నుండి 23 వరకు 8 వ పోషణ్ పక్వాడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మల్లిశాలలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎస్.అమ్మాజీ గర్భవతులు,బాలింతలకు పోషణపై అవగాహన, పుట్టినప్పటి నుండి 2 సంవత్సరాల పిల్లల అభివృద్ధిపై మెదడు అభివృద్ధి అవగాహన, స్క్రీన్ టైమ్ నివారణపై ప్రచారం మరియు తల్లులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ జి కామేశ్వరి, ఎన్. సుబ్బలక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ కట్టా శ్రీనివాస్ కు ఘన సత్కారం




**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 10;**మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కట్టా శ్రీనివాస్ ను సచివాలయం సిబ్బంది ఘనంగా సత్కరించి అభినందించారు. ఇటీవల టీబీ రహిత పంచాయతీగా జొన్నాడ గ్రామం ఎంపిక కావడంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా గోదావరి భవన్ నందు జాయింట్ కలెక్టర్, డిఎంహెచ్ఓల చేతుల మీదుగా సర్పంచ్ కట్టా శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఆయనను శుక్రవారం సచివాలయం సిబ్బంది శాలువాలు కప్పి,పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం గ్రామానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

# మంగళగిరి లో జరిగే బోడె"ఆమరణ నిరాహార దీక్ష కు తరలిరావాలి

**రాష్ట్ర పీఏసీ సభ్యులు అత్తిలి రాజు పిలుపు**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 10:**బీసీ వై పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ బీసీ హక్కుల సాధన కోసం సంకల్పంతో శనివారం 10:45 గంటలకు మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం పూలే--మండల్ భవనం వద్దచేపట్టబోయే "ఆమరణ నిరాహార దీక్ష" విజయవంతం కావాలని రాష్ట్ర పీఏసీ సభ్యులు అత్తిలి రాజు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని మూడు కోట్ల బీసీ ప్రజలు మేలుకొని, బోడె రామచంద్ర యాదవ్ నాయకత్వంలో ఐక్యంగా నిబద్ధతకు తోడుగా ఉండాలని పిలుపునిచ్చారు. బీసీ వర్గాల భవిష్యత్తును మార్చే ఈ యజ్ఞాన్ని ముందుకు తీసుకు వెళ్లతున్న రామచంద్ర యాదవ్ కి ప్రతి బీసీ తోడుగా నిలవాలన్నారు. హక్కులు సాధించే వరకు పోరాటానికి సిద్ధంగా ఉండాలని కోరారు. బీసీ ధర్మ దీక్ష కు అన్ని వర్గాల నుండి లభిస్తున్న మద్దతుకు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కో-కన్వీనర్ నాగేశ్వరీ శ్రీ,జిల్లా యూత్ కన్వీనర్ నీలపాల సాయి మణికంఠ,రాజమండ్రి సిటీ కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నన్నయ్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ వేడుకలకు హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్




**గవర్నర్‌కు స్వాగతం, వీడ్కోలు అధికారులు, విద్యావేత్తలు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ , ఏప్రిల్ 10:**ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం 16వ, 17వ స్నాతకోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం హాజరయ్యారు.ఉదయం 11 గంటల సమయంలో రాజానగరం సమీపంలోని గైట్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న గవర్నర్‌కు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్ కుమార్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జీజీయూ చాన్సలర్ కె.వి.వి. సత్యనారాయణ రాజు, నన్నయ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి. స్వామి తదితరులు గవర్నర్‌కు స్వాగతం పలికారు.అనంతరం హెలిప్యాడ్ నుంచి నన్నయ్య విశ్వవిద్యాలయానికి గవర్నర్ వెళ్లారు.

స్నాతకోత్సవ వేదిక వద్ద వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. ప్రసన్న శ్రీ, ముఖ్య అతిథి ప్రొఫెసర్ మహేంద్ర పి. లామా, ఏపీఎస్‌సీహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ కొత్త మధు మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి. స్వామి, యూనివర్సిటీ అధ్యాపకులు తదితరులు గవర్నర్‌ను ఆహ్వానించారు. స్నాతకోత్సవ వేడుకలు ముగిసిన అనంతరం గవర్నర్ తిరిగి గైట్ ఇంజినీరింగ్ కాలేజ్‌కు చేరుకుని స్వల్ప విరామం తీసుకున్న తర్వాత విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి. నరసింహ కిషోర్, జేసి వై మేఘా స్వరూప్, కమిషనర్ రాహుల్ మీనా, జీజీయూ చాన్సలర్ కె.వి.వి. సత్యనారాయణ రాజు, తదితరులు గవర్నర్‌కు ఘన వీడ్కోలు పలికారు.

# గోపాలపురంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు.

రొంగల సత్యనారాయణ.

**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 10.** సంఘసంస్కర్త మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు గోపాలపురంలో శనివారం నిర్వహిస్తున్నట్లు టిడిపి రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్, టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు రొంగల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గస్థాయిలో శనివారం సాయంత్రం జరిగే ఈ వేడుకలకు స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు హాజరవునున్నారన్నారు. ముందుగా స్థానిక ఎస్బిఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం భారీ సమావేశం నిర్వహించనున్నామన్నారు. నియోజకవర్గంలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ జయంతి వేడుకలకు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బీసీ నాయకులు అధిక సంఖ్యలో రావాలని సత్యనారాయణ కోరారు.

# వందన్ వికాస కేంద్రాల ద్వారా గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధి

**కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డా. వర్ణాలి దేఖ**





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 10:** గిరిజన ప్రాంతాలలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కేంద్ర ప్రభుత్వం వందన్ వికాస కేంద్రాలను ఏర్పాటు చేసిందని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డా. వర్ణాలి దేఖ తెలిపారు.శుక్రవారం రంపచోడవరం మండలం పందిరి మామిడి సెంటర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో వందన్ వికాస కేంద్రాల ద్వారా ఏర్పాటు చేసిన జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆమె, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న వీవీకేలు, క్లస్టర్లు, మహిళా సంఘాల సంఖ్య, మహిళల పని గంటలు, ఉపాధి అవకాశాలు, నెలవారీ ఆదాయం, జీడిపప్పు ప్రాసెసింగ్ సామర్థ్యం, కొనుగోలు మరియు ఉత్పత్తి వివరాలు, మార్కెటింగ్ విధానంపై డైరెక్టర్ సమగ్రంగా ఆరా తీశారు. ఒక్కో మహిళ ఎంత మేర ఆదాయం పొందుతున్నది, జీడిపప్పు ధరలు, లాభాలపై కూడా వివరాలు సేకరించారు.గిరిజనుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం అడవి ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆమె పేర్కొన్నారు. గిరిజనుల భూములపై యాజమాన్య హక్కులు, జీవనోపాధి అవకాశాలు బలోపేతం చేయడమే ముఖ్య లక్ష్యమని అన్నారు.తరువాత ప్రాజెక్ట్ అధికారుల చాంబర్‌లో జాయింట్ కలెక్టర్‌తో కలిసి కేంద్ర పథకాల అమలు విధానంపై సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఏపీఓ జనరల్ డీఎన్వీ రమణ, రబ్బర్ బోర్డు డెవలప్మెంట్ అధికారి సుశాంత్ కుమార్ నాయక్, డీఆర్‌డీఏ డిపిఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చవిటి దిబ్బలు సెంటర్లో వాహనాలు తనిఖీ చేసిన ఎస్ఐ



**వై రామవరం, పెన్ పవర్,ఏప్రిల్ 10:** మండలంలో చవిటి దిబ్బల సెంటర్లో వై.రామవరం ఎస్సై పృథ్వీ యాదవ్ శుక్రవారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. విధి నిర్వహణలో భాగంగా వాహనాలు తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. విధిగా ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహనానికి సంబంధించిన రికార్డులు పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించడం జరిగిందన్నారు.

# తాడిపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నామా కొండబాబు





**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 10:**మండలంలోని తాడిపూడి రైతు సేవా కేంద్రం నందు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన సొసైటీ అధ్యక్షులు నామా వెంకట సుబ్బారావు(కొండబాబు). ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని, రైతును రాజును చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని, ప్రధానంగా ఈ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అని పండించిన చివరి దాన్యపు గింజ వరకు గిట్టుబాటు ధరతో ప్రభుత్వ కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. ధాన్యాన్ని తరలించిన 24 గంటల్లో రైతు ఖాతాలోకి నగదు జమ కావడం జరుగుతుందన్నారు. సబ్సిడీ ద్వారా రైతులకు వ్యవసాయ యంత్రాలను, టర్ఫాలిన్ లను కూడా అందిస్తున్నామన్నారు. రైతులెవరు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు అన్నారు. వ్యవసాయ అధికారి రుచిత మాట్లాడుతూ రైతులకు సరిపడా నాణ్యమైన గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఇష్టం వచ్చిన మిల్లుకి ధాన్యాన్ని తరలించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ నామా రంగయ్య, టిడిపి నాయకులు సిద్ధన రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి తానేటి నవీన, తిరుమలశెట్టి సత్యనారాయణ, వీరిశెట్టి రాంబాబు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడం నా బాధ్యత



**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**- కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ**

**రాజమహేంద్రవరం :పెన్ పవర్, ఏప్రిల్ 10** ప్రజా ప్రతినిధిగా ప్రజల సమస్యలను పరిష్కరించడం తన బాధ్యతని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజలకు నేరుగా తమ సమస్యలు తెలియజేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. . . అందిన ప్రతి అర్జీపై సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కారం చూపిస్తామన్నారు. టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, నాయకులు వర్రే శ్రీనివాసరావు, ఉప్పులూరి జానకి రామయ్య, మొకమాటి సత్యనారాయణ, కొల్లి బుజ్జి, తంగెళ్ళ బాబీ తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## చెన్నై సూపర్ కింగ్స్ సరైనా ప్లేయర్స్‌ని తీసుకోలే..

# CSKపై మాజీ క్రికెటర్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టుగా పేరుగాంచిన చెన్నై సూపర్ కింగ్స్, ప్రస్తుతం గడ్డు పరిస్థితులని ఎదుర్కొంటోంది. 2025 సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన సీఎస్కే. ప్రస్తుత 2026 సీజన్‌లో కూడా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది. దీంతో జట్టు ఎంపిక, వేలంలో తీసుకున్న నిర్ణయాలపై మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ చేసిన విమర్శలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి.

**ధరకు తగ్గ ప్రదర్శన ఎక్కడ?:**

మినీ వేలంలో ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మ అనే ఇద్దరు ప్లేయర్స్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ ఏకంగా ఒక్కొక్కరికి రూ. 14 కోట్లకు పైగా ఖర్చు చేసింది. అయితే, ఇప్పటి వరకు వారు ఆడిన తీరు చూస్తుంటే అంత భారీ ధర పెట్టడం అవసరమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని బద్రీనాథ్ అన్నారు. ఎవరో ఇచ్చిన సలహాలు విని అంత డబ్బు ధారపోశారు, కానీ క్షేత్రస్థాయిలో వారి ప్రదర్శన మాత్రం నిరాశాజనకంగా ఉందని విమర్శించారు.

**స్కౌటింగ్ వైఫల్యంపై విమర్శలు:**

ప్రతిభ గల ఆటగాళ్లను గుర్తించడంలో సీఎస్కే ఇతర జట్ల కంటే వెనుకబడి ఉందని సుబ్రమణ్యం బద్రీనాథ్ తెలిపారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కోసం హేమంగ్ బదానీ, వేణుగోపాల్ రావు లాంటి వారు ప్రపంచవ్యాప్తంగా ఉన్న లీగ్‌లను గమనిస్తూ ఆటగాళ్లను వెలికితీస్తారని కొనియాడారు. ముంబై ఇండియన్స్ జట్టుకు జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా లాంటి దిగ్గజాలు దొరకడానికి కారణం వారి స్కౌట్ జాన్ రైట్.. సీఎస్కేకు అటువంటి పటిష్టమైన స్కౌటింగ్ వ్యవస్థ లేకపోవడం మైనస్ అని వెల్లడించారు.

**శనివారం ఢిల్లీతో కీలక పోరు**

వరుస ఓటములతో కుంగిపోయిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు, తమ తదుపరి మ్యాచ్‌లో భాగంగా శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి ఫామ్‌లోకి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే బద్రీనాథ్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే, జట్టులో సమూల మార్పులు జరిగితే తప్ప సీఎస్కేకి పూర్వ వైభవం రాదని స్పష్టమవుతోంది.

## నీవు నా కొడుకు కెరీర్ ముగించేశావు: క్రిస్ బ్రాడ్ ఆవేదన.. యువీ రియాక్షన్!



**హైదరాబాద్ పెన్ పవర్:** 2007 టీ20 ప్రపంచకప్‌లో యువరాజ్ సింగ్ ఒకే ఓవర్లో ఆరు సిక్సర్ల విధ్వంసం క్రికెట్ చరిత్రలో ఒక అద్భుతం. అయితే ఆ ఘటన తర్వాత మైదానం వెలుపల జరిగిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను యువీ ఇటీవల 'ది ఓవర్ లాప్' షోలో పంచుకున్నాడు. ఆ సిక్సర్ల వర్షం స్టువర్ట్ బ్రాడ్ కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపిందో, అతని తండ్రి క్రిస్ బ్రాడ్ ఎలా స్పందించారో యువీ వివరించాడు. ఆ మ్యాచ్‌కు రిఫరీగా ఉన్న స్టువర్ట్ బ్రాడ్ తండ్రి క్రిస్ బ్రాడ్ మ్యాచ్ ముగిశాక యువరాజ్ వద్దకు వచ్చి, "నువ్వు దాదాపు నా కొడుకు కెరీర్‌ను ముగించేశావు" అని అన్నారట. ఒక తండ్రిగా తన కొడుకు పడుతున్న బాధను ఆయన అలా వ్యక్తం చేశారు. దానికి యువీ స్పందిస్తూ.. "సర్, గతంలో నా బౌలింగ్‌లో కూడా ఐదు సిక్సర్లు పడ్డాయి, ఆ బాధ నాకు తెలుసు" అని ఆయనను ఓదార్చే ప్రయత్నం చేశాడు. ఆ తర్వాత క్రిస్ బ్రాడ్ కోరిక మేరకు ఒక జెర్సీపై యువీ సంతకం చేస్తూ.. "నువ్వు భవిష్యత్తులో ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్‌గా ఎదుగుతావని ఆశిస్తున్నాను" అని రాసిచ్చాడు.

అయితే, ఆ జెర్సీని స్టువర్ట్ బ్రాడ్ కోపంతో డస్ట్‌బిన్‌లో పడేశాడని యువీకి ఇటీవల తెలిసింది. "అంతటి అవమానం జరిగినప్పుడు ఆ కోపం రావడం సహజమే, అది తప్పు కాదు" అని యువీ చాలా పరిణతితో స్పందించాడు. ఆ ఎదురుదెబ్బతో కుంగిపోకుండా బ్రాడ్ 600 పైగా టెస్ట్ వికెట్లు తీసి లెజెండరీ బౌలర్‌గా ఎదగడం గొప్ప విషయమని యువీ కొనియాడాడు.

## పంత్ భాయ్ చెప్పాడు.. నేను కొట్టాను: లక్నో హీరో ముకుల్ చౌదరి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్‌లో ప్రతిభకు కొదవ లేదు. కానీ సరైన అవకాశం, మార్గదర్శకత్వం లభించినప్పుడే యువ ఆటగాళ్లు సంచలనాలు సృష్టిస్తారు. లక్నో సూపర్‌జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) యువ బ్యాటర్ ముకుల్ చౌదరి విషయంలో ఇదే జరిగింది. గురువారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్‌లో 22 ఏళ్ల ముకుల్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో తన జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. 182 పరుగుల లక్ష్య ఛేదనలో లక్నో కష్టాల్లో ఉన్నప్పుడు క్రీజులోకి వచ్చిన ముకుల్, కేకేఆర్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అవేశ్ ఖాన్‌తో కలిసి 54 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఇందులో విశేషమేమిటంటే, అవేశ్ ఖాన్ కేవలం ఒక పరుగు మాత్రమే చేయగా, మిగిలిన 52 పరుగులు ముకుల్ బాదడం విశేషం. చివరి బంతికి బౌండరీ కొట్టి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. మ్యాచ్ అనంతరం ముకుల్ మాట్లాడుతూ తన ప్రదర్శన వెనుక కెప్టెన్ రిషబ్ పంత్ ఇచ్చిన సలహా ఉందని వెల్లడించాడు. "గతంలో మ్యాచ్‌లను ముగించడానికి చాలా తొందరపడేవాడిని. కానీ ఇప్పుడు ప్రశాంతంగా ఉండటంపై దృష్టి పెట్టాను. ఆటను చివరి వరకు తీసుకెళ్తే గెలిపించగలనని నమ్ముతున్నా" అని తెలిపాడు. "గత మ్యాచ్‌లో సరిగా టైమింగ్ చేయలేకపోయాను. దాంతో రిషబ్ భాయ్‌తో మాట్లాడాను. 'నువ్వు అతిగా ఆలోచిస్తున్నావు. నీ పనిపై దృష్టి పెట్టు. బంతిని చూసి ఆడు. నీపై నాకు నమ్మకం ఉంది. నీపై నీకు కూడా నమ్మకం ఉండాలి' అని చెప్పాడు. ఆ మాటలు నాలో ఆత్మవిశ్వాసం నింపాయి" అని ముకుల్ వివరించాడు. పంత్ ఇచ్చిన భరోసాతోనే ఎలాంటి ఒత్తిడి లేకుండా తన సహజమైన ఆట ఆడి జట్టును గెలిపించగలిగానని ముకుల్ పేర్కొన్నాడు.

## బ్లూ జీన్స్‌లో ఈషా గ్లామర్ టచ్.. నెట్టింట ట్రెండ్







తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వరంగల్ చిన్నది ఈషా రెబ్బా, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలతో నెటిజన్ల మనసు దోచుకుంటోంది. బ్లూ అండ్ బ్లూ జీన్స్ లుక్‌లో ఆమె కనిపిస్తున్న తీరు ఎంతో స్టైలిష్‌గా, అదే సమయంలో చాలా సింపుల్‌గా ఉంది. కస్సుమనే చూపులతో, డిఫరెంట్ స్టిల్స్‌లో ఈషా పంచుకున్న ఈ ఫోటోలు ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతూ ట్రెండింగ్‌లో నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లోనే కాకుండా, ఇలాంటి వెస్టర్న్ వేర్‌లో కూడా ఆమె గ్లామర్ అదిరిపోయిందని ఫ్యాన్స్ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

**డెనిమ్ లుక్‌లో ఈషా మెరుపులు:**

తాజా ఫోటో షూట్‌లో ఈషా రెబ్బా పూర్తి డెనిమ్ లుక్‌లో దర్శనమిచ్చింది. బ్లూ కలర్ జీన్స్ షర్ట్, దానికి తగ్గట్టుగా జీన్స్ ప్యాంటు ధరించి ఒక నేచురల్ లుక్‌ను సొంతం చేసుకుంది. ఫోటోలో ఆమె కింద కూర్చుని, ఒక చేత్తో ఎల్లో కలర్ 'మినియన్' మగ్‌ను పట్టుకుని, మరో చేతిని తలకు ఆనించి సీరియస్ లుక్ ఇస్తున్న తీరు చాలా ఆకర్షణీయంగా ఉంది. ఇక ఎలాంటి ఆడంబరాలు లేకుండా చాలా సింపుల్‌గా కనిపిస్తూనే, తన కళ్ళతో నెటిజన్లను మెస్మరైజ్ చేస్తోంది. ఈ 'డబుల్ డెనిమ్' ట్రెండ్ ఈషాకు పర్ఫెక్ట్‌గా సెట్ అయిందని చెప్పవచ్చు.

**తెలుగమ్మాయి ప్రయాణం.. సినిమాల సందడి:**

ఇక లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సినిమాతో కెరీర్ మొదలుపెట్టిన ఈషా, అంతకు ముందు ఆ తర్వాత చిత్రంతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగమ్మాయి కావడంతో మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా, తన నటనతో ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చింది. అమీ తుమీ, బందిపోటు వంటి సినిమాల్లో తన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకుంది. ఇక నాని నిర్మించిన అ సినిమాతో పాటు, ఎన్టీఆర్-త్రివిక్రమ్ కాంబోలో వచ్చిన 'అరవింద సమేత'లో ఒక కీలక పాత్రలో నటించి స్టార్ హీరోల సినిమాల్లోనూ తన సత్తా చాటింది. ప్రస్తుతం ఆమె బాలీవుడ్ ఎంట్రీకి కూడా సిద్ధమవుతోంది.

**సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్:**

ఈషా రెబ్బా సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. షూటింగ్ విశేషాలతో పాటు తన వ్యక్తిగత ఫోటోలను కూడా ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌తో పంచుకుంటుంది. హీరోయిన్‌గానే కాకుండా, సెకండ్ హీరోయిన్‌గా కూడా వైవిధ్యమైన పాత్రలు చేస్తూ విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ఇక రీసెంట్ గా 'మామా మశ్చీంద్ర', 'ఓం శాంతి శాంతి శాంతిః' వంటి మూవీ లతో అలరించిన ఈ భామ, కేవలం తెలుగుకే పరిమితం కాకుండా తమిళ్, మలయాళ భాషల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. అందుకే ఆమెకు దక్షిణాది అంతటా ఫాలోయింగ్ పెరుగుతోంది.

**స్టార్ ఇమేజ్ దిశగా అడుగులు:**

ప్రస్తుతం ఈషా రెబ్బా పంచుకున్న ఈ బ్లూ జీన్స్ పిక్స్ ఆమె గ్లామర్ రేంజ్‌ను మరోసారి చాటిచెప్పాయి. ఫోటోలో ఆమె కూర్చున్న భంగిమ, ఆ ఎల్లో మగ్ కాంబినేషన్ నెటిజన్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. చిన్న సినిమాల నుంచి మొదలై ఈరోజు పాన్ ఇండియా స్థాయికి ఎదిగేందుకు ఈషా చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. గ్లామర్ ప్లస్ టాలెంట్ ఉన్న ఈ వరంగల్ బ్యూటీ, త్వరలోనే బాలీవుడ్ లోనూ జెండా పాతాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈషా ఇలాంటి మరిన్ని విభిన్నమైన ఫోటోషూట్‌లతో అభిమానులను అలరించాలని ఆశిద్దాం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com